
# ఈ వారం కథ



## గొడ్డూ - మనిషీ

- గోపరాజు నాగేశ్వరరావు

తదియ చంద్రుడు నిర్మల నీలాకాశంలో వంచిన స్టీలు నాలుక బద్దల్లే బలహీనంగా వెలుగుతున్నాడు. అర్థరాత్రి దాటినట్టుంది. పశువుల కొట్టం చుట్టూ వున్న సర్కారు తుమ్మల కరకంచి నించి కీచురాళ్లు 'గీ'మ్మంటూ అదే పనిగా రొద పెడుతున్నాయి.

చుట్ట కొసను ముని పళ్ళతో కసిక్కున కొరికి తుపుక్కున ఉమ్మి అగ్గి పుల్లతో చుట్టను వెలిగించి తాదాత్మ్యం పొందబోతున్న రసానుభూతితో కళ్ళు అరమోడ్పులు చేసి గట్టిగా దమ్ము లాగేడు పాలేరు పాపయ్య. ఊఁ... హు... పొగ రాద్దే.... తపోభంగమైన మునిలా కసురుకొంటూ 'ధూత్తేరీ...' అని చుట్ట ముక్కను దూరంగా విసిరికొట్టి కొట్టంలోకి దారి తీసేడు.

పాపయ్యకి పసితనంలో అంబాడే వయసొచ్చి-బుల్లి బుల్లి చేతుల్తో మట్టి ముంత పట్టుకొని ఆబగా అందులోని గంజి నీళ్ళు జుర్రుకోవటం - మరి కొంచెం పెద్దయింతర్వాత గంజితో పాటు పెద్దుల్లి కొరికి నంజుకోవటం నేర్పిం తర్వాత ఇక ప్రయోజకుడయ్యాక? నిర్ణయించుకొని మంచి రోజు చూసి తన యజమాని దగ్గరే వాణ్ణి కూడా బుల్లి పాలేరుగా చేర్పాడు పాపయ్య తండ్రి.

కసాయి కాలం మృత్యువు రూపంలో పెద్ద దొరవార్నీ, ఆటు తర్వాత కొంతకాలానికి పెద్ద పాలేరయిన పాపయ్య వాళ్ల నాన్నను కూడా పొట్టన పెట్టుకున్న తర్వాత ఇక దొర వారి లంకంత ఇంట్లో మందీ, మార్బలంతో పాటు బుల్లి దొరగారూ పాలేరు పాపయ్యా మిగిలేరు. పెద్ద పాలేరుకు మల్లేనే ఎప్పటిలా బుల్లి పాలేరు పని చేస్తుంటే పెద్ద దొరవారికి మల్లేనే బుల్లి దొరవారు కొరడా పట్టుకొని పులిలా పచార్లు చేస్తూ పనులు చేయించేయిస్తున్నారు. అలా వాళ్ళిద్దరూ పెరిగి పెద్దై మనుగడ కోసం మళ్లీ మళ్ళీ జరిగే ఎలక్షన్లలో గెలిచేందుకు దానికి బోర్లేసి ఓట్లు కావాల్సొచ్చి-ఓట్ల కుప్పలుండే నురికి పెటల మీన బోర్లేసి వలలు విసరాల్సొచ్చింది.

"... ప్రభుత్వ బంజరు భూముల్ని పేదలకు పంచిపెట్టాలనీ, భూసంస్కరణలు అమలు జరిపి పేదల పక్షాన నిలిచేందుకు ప్రభుత్వం వెనుకాడబోదనీ మంత్రి చెప్పారు... ఆకాశవాణి . వార్తలు సమాప్తం."

పంచాయతీ రేడియోలో అది విన్న పాపయ్యకు కొడుకు గుర్తొచ్చాడు. అసలు వాడు పుట్టే ముందే నిస్సహాయతలోంచి నిర్లిప్తత పుట్టి దాన్లోంచి వేదాంతం తలెత్తి ఆ వేదాంతం లోంచి తేలు కొండెల్లా లేచిన చాలా చాలా ప్రశ్నల్లోకల్లా పాపయ్యకు బాగా గుర్తుంది. "నాకూ కొడుకు పుడతాడా?" అన్నది మాత్రమే! కాని పాలేరు పాపయ్యకూ కొడుకు పుట్టేడు!

పులి ఎనుబోతును చంపి తిని కడుపు నిండిం

తర్వాత అలివి గాని ఎముకల్ని నమల కుండా విడిచిపెట్టినట్టు దొరవారి తాతగారి కాలంలోనే వారి వందెకరాల పొలం పక్కనే వున్న ఇరవై ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కలిపేసుకొని దక్షిణ పక్క నున్న రెండెంకరాల రాళ్ల భూమిని మాత్రం వదిలిపెట్టేసేరు.

పాపయ్యకు ఆ పొలం గుర్తొచ్చింది. రాళ్లను పెకలించి దూరంగా దొర్లించి సేద్యం చేస్తే అందులోనూ రత్నాలు పండించొచ్చు!

అందుకు దొరవారి అనుమతి కోరాడు పాపయ్య.

సగం కాల్చిన మూడైదుల సిగరెట్టును విసిరి కొడుతూ "రాళ్ల పొలం ఎలా సాగు చేస్తావ్రా?" అన్నాడు దొర. అదేదో జరగని పనన్నట్టు.

"సీతాలూ నేనూ కట్ట పడ్తాంలే దొరా..." అని దొర మౌనాన్ని అంగీకారంగా గుర్తించి ఆ రాత్రి నించే సీతాల్ని వెంటేసుకొని పని ప్రారంభించాడు పాపయ్య. పొలం ప్రక్కనే వేప చెట్టుకు చీరె ఉయ్యాల వేసి కొడుకును పడుకోబెట్టి మధ్య మధ్యలో వూపుతూ "ఈ పొలానికి ఈడేనే దొర..., మనం ఈ దొరకు పాలేర్లం" అని ముసి ముసి నవ్వులు నవ్వేవాడు.

"చాల్లేద్దూ బడాయి..." అని మూతిని మూడొంకలు తిప్పి అటుగా తిరిగి హాయిగా నవ్వుకునేది సీతాలు. పగలంతా సీతాలే పని చేసేది. దొర వారింట్లో పనైంతర్వాత రాత్రికల్లా పాపయ్య వచ్చి కలిసేవాడు.

అలా సంవత్సరం గడిచేసరికల్లా పాపయ్యా సీతాలూ కలిసి రాళ్లన్నీ పెకలించేశారు. పొలం చదును చేసి అందంగా గట్లు కూడా పోసేరు.

ఓ రోజు ప్రొద్దున్నే యథాప్రకారం పనిలో కొచ్చిన పాపయ్యను చూసి - వేప్పుల్లను దూరంగా విసిరికొట్టి పళ్ల మధ్యలో ఇరుక్కున్న పీచుల్ని లాక్కుంటూ "ఏంరా... పొలానికి గట్లు కూడా పోసేరట?" అడిగేడు దొర.

"అంతా తమరి దయ"

"దొరగారి పొలం అనుకొని పాలేరుకు పొలం వుండడం బాగుంటుందట్రా..." సౌమ్యంగానే అడిగాడు దొర.

భూమి తిరగబడుతున్నట్టూ, తను భూంలోకి కూరుకుపోతున్నట్టూ నివ్వెరపోయాడు పాపయ్య. 'పిల్లాడి కోసరం... ' ఆపై మాట్లాళ్లేకపోయాడు. గొంతు కేదో అడ్డుపడ్డట్టు నిలువెల్లా కంపించేడు.

"నీ పిల్లాడికేం బాదొచ్చిందంట్రా? మీ అయ్య మా అయ్యనూ, నువ్వు నన్నూ ఆశ్రయించుకొని బతికినట్టే నీ కొడుకూ నా కొడుకు దగ్గర బతుకుతాడ్లే." తేల్చి చెప్పాడు దొర.

'దొరా... బంజర్లు మాకిస్తామని ప్రభుత్వం చెప్పింది..."

దొర ముఖంలో రంగులు మారాయి.

"ఓహో... ప్రభుత్వం చెప్పిందా?" అని శాంతంగా లేచి నుంచొని అరుగు మీద చుట్ట చుట్టుకు పడుకున్న పాము లాంటి కొరడాను చేత్తో అందుకొని "అయితే పొలం కావల్సిందేనంటావ్?" అని మరింత శాంతంగా అడిగేడు దొర.

ఒగుదాకులా వణికిపోతూ దబ్బున దొర కాళ్ల మీద పడి "దొరా... అన్యాయం చేయకండి.. బిడ్డ కోసం గొడ్డు చాకిరి చేసి భూమంతా చదును చేశాం..."

దొర కొరడా గాల్లోకి లేచి గిరికీలు కొట్టి పాపయ్య వీపు మీద వాలి వీపును చీరేసింది. పాపయ్య గుండె దిగజారింది. ధైర్యం ఎగిరిపోయింది. నరాలు చల్లబడ్డాయి. భయం మింగిన పాపయ్య గువ్వలా ముడుచుకుపోతూ "దొరా కొట్టకు... బుద్ధి గడ్డి తింది. తప్పైపోయింది దొరా... తప్పై..." దొర కొరడా భయం తెలిసినే పాపయ్య భోర్న ఏడ్చాడు.

> కాటువెయ్యకపోయినా పాముకు పోయే దేమీలేదు. అది దానికి సరదా కూడా కావచ్చు. కానీ ఆవు పరిస్థితి అది కాదు. జీవన్మరణ పోరాటం. పాము నుంచి తనన్నూ, తన బుజ్జాయినీ రక్షించు కోవాలి. అందుకు, ప్రాణానికి తెగించి పోరాడాలి. అందుకే అది తిరగబడింది. బానిసత్వపు సారం దాని నరాల్లో ప్రవహించదు. భయానికీ లౌక్యానికీ నిర్వచనం తెలీని గొడ్డు అది!
>
> మరి మనిషి కదా, తనేం చెయ్యాలి?

దొర శాంతించాడు. ఆడించిన పాంను పాములోడు బుట్టలో పెట్టినట్టు చుట్ట చుట్టిన కొరడాను చంకలో పెట్టుకొని 'లఫంగి నాయాల. మళ్లీ పొలం కాడికి వెళ్తే వీపు చీరేస్తాను' అని - ఇంట్లోకి వెళ్ళబోయి మళ్లీ ఆగి - "ఒరేయ్. పొద్దునే ఆవు ఈనింది. కొట్టంలో రాత్రికి దానికి కావి లుండు" అని చెప్పి విస విసా నడిచి వెళ్ళిపోయాడు దొర.

అర్ధరాత్రి దాటింది. కొట్టంలో గేదెలు నెమరేస్తున్నాయి. పాపయ్య ఆ రోజు జరిగిందంతా నెమరేస్తూ గొడ్డంలో నరికిన దబ్బలను గాట్లో వేసి బక్కెట్లో నీళ్లు పోసి- కాస్తంత తవుడు కలిపి ఈనిన ఆవు ముందుంచేడు. ఊహూ... అది కుడితి కేసైనా చూస్తేనా? ఆ రోజే పుట్టిన బుజ్జాయిని ఆప్యాయంగా నాకుతూ మురిసిపోతోంది.

పాపయ్య అక్కడి నించి కదిలి వెళ్లి కొంచెం దూరంలో వున్న అరుగు మీద వెల్లికితలా పడుకొని ఆకాశం కేసి చూస్తూ...

కొట్టంలోంచి అలికిడి వినిపించింది. ఆవెందుకో పెద్దగా రంకె లేస్తూ పలుపు తెంచుకునేందుకు బలంగా లాగుతున్నట్టుంది!

పాపయ్య చివాల్న లేచేడు. ఒక చేత్తో గొడ్డలి, మరో చేత్తో లాంతరూ పట్టుకొని కొట్టంలోకి వెళ్లాడు. లాంతరు మసక వెల్తురులో ఆవుకు కొంచెం దూరంలో పడగ విప్పి ఆడుతున్న తాచు పాం కనిపించింది! ఆ పాం బుసలు పెడుతూ ముందుకొచ్చేందుకు విశ్వ ప్రయత్నం చేస్తోంది. తల్లి ఆవు రంకెలేస్తూ పలుపు తెగితే చాలు... పాం మీద పడి కొమ్ముల్తో కుమ్మి చంపాలన్నట్టు పెనుగులాడుతోంది. మధ్య మధ్యలో మోరతో బుజ్జాయిని తన వెనక్కు నెడుతూ పాం కేసి దూకేందుకు తల్లి ఆవు తపన పడుతోంది.

పాపయ్య ఆలస్యం చెయ్యలేదు. లాంతర్ని కింద పెట్టి గొడ్డల్ని పైకెత్తి పాం కేసి కదిలేడు. ప్రమాదం పసి గట్టిన పాము క్షణంలో జారుకుంది. జరజరా పాక్కుంటూ చీకట్లో కలిసి పోయింది.

క్రమంగా తల్లి ఆవు శాంతించింది. బుజ్జాయిని మరింత ఆబగా నాకుతూ ఆనందంతో వింతగా మూల్గుతుంది.

వాటిని అలాగే క్షణం సేపు చూసి - వెళ్ళి గొడ్డల్ని అరుగుకు ఆన్చి పెట్టి అరుగు మీద పడుకున్నాడు పాపయ్య. అతడిలో ఏదో సంఘర్షణ మొదలైంది. నరాలకు చైతన్య దట్టించి నట్టయింది.

- కాటు వెయ్యకపోయినా పాముకు పోయేదేమీ లేదు. అది దానికి సరదా కూడా కావచ్చు! కానీ ఆవు పరిస్థితి అది కాదు. జీవన్మరణ పోరాటం. పాము నించి తన్నూ, తన బుజ్జాయినీ రక్షించుకోవాలి. అందుకు ప్రాణానికి తెగించి పోరాడాలి. అందుకే అది తిరగబడింది. బానిసత్వపు సారం దాని నరాల్లో ప్రవహించదు. భయానికీ, లౌక్యానికీ నిర్వచనం అస్సలే తెలీదు. అది గొడ్డు!

మనిషిని కదా నేనేం చెయ్యాలి?

గుండె నిండా గాలి పీల్చుకున్న పాపయ్య ఛాతీ ఉబ్బి ఉబ్బి ఆకాశం అంతయింది. తల తిప్పి చూసేడు.

తదియ చంద్రుడి లేత వెన్నెల
కిరణాలక్కూడా
పదునైన గొడ్డలి అంచు తళతళా
మెరిసింది!